

నమ్మ మెట్రోకు బాంబు బెదిరింపు

బెంగళూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలోని నమ్మ మెట్రో స్టేషన్‌ను బాంబుతో పేల్చివేస్తామనీ, తానో ఉగ్రవాది లాంటివాడినని ఈ-మెయిల్ ద్వారా బెదరింపు సందేశం పంపారు. ఈనెల 14న రాత్రి 11.30 గంటలకు ఓ వ్యక్తి బీఎంఆర్‌సీఎల్ మెయిల్‌ఐడీకి సందేశం పంపారు. అధికారుల ఫిర్యాదు మేరకు విల్సన్‌గార్డెన్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. విడాకులు తీసుకున్న భార్యను మెట్రో సిబ్బంది వేధిస్తున్నారని, సందేశంలో రాసుకున్నారు. నేనో ఉగ్రవాది వంటివాడినని, మెట్రో స్టేషన్ పేల్చివేయాల్సి ఉంటుందని సందేశంపంపారు. పోలీసులు సదరు వ్యక్తికోసం గాలింపు జరుపుతున్నారు.

ప్రపంచ సాంకేతిక క్రాంతిగా.. కర్ణాటక



బెంగళూరు టెక్ సమ్మిట్‌లో ప్రసంగిస్తున్న సీఎం సిద్దరామయ్య

- బెంగళూరు టెక్ సమ్మిట్‌లో సీఎం సిద్దరామయ్య
- పెట్టుబడులకు అనుకూల వాతావరణం
- ఐటీ, స్టార్టప్, స్పేస్‌టెక్‌కు ప్రత్యేక పాలసీలు

బెంగళూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సాంకేతికరంగంలో ప్రపంచానికి కర్ణాటక క్రాంతిగా విరాజిల్లుతోందని ప్రభుత్వం స్పష్టమైన పాలసీలు, ఉత్తమమైన రీతిలో అనుమతులు, నైపుణ్యత, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులకు తగిన వాతావరణం అనుకూలం చేశామని సీఎం సిద్దరామయ్య అన్నారు. కర్ణాటక దేశంలోనే అత్యంత విశ్వసనీయమైన పెట్టుబడుల కేంద్రంగా మారిందన్నారు. 28వ బెంగళూరు టెక్ సమ్మిట్‌ను మంగళవారం బెంగళూరు ఇంటర్నేషనల్ ఎగ్జిబిషన్ సెంటర్ (బీఐఈసీ)ల లాంఛనంగా ప్రారంభించారు. డీసీఎం డీకే శివకుమార్, ఐటీ, బీటీ శాఖ మంత్రి ప్రియాంకఖర్గే, భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ ముఖ్యులుగా పాల్గొన్నారు. ఐటీబీటీ శాఖ, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా టెక్ సమ్మిట్‌ను ఏర్పాటు చేశాయి. దేశ విదేశీ సాంకేతిక కంపెనీల ప్రముఖులతోపాటు వివిధ దేశాల ప్రతినిధులను ఉద్దేశించి సీఎం మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా బెంగళూరులో జరుగుతున్న టెక్ సమ్మిట్‌లో అంతర్జాతీయ భాగస్వామ్యం ఏటా పెరుగుతూ వచ్చిందన్నారు. ఆధునిక, సాంకేతిక రంగంలో కొత్త ఆవిష్కరణలను, పరిశోధనలకు దిశా నిర్దేశం చేసే రీతిలో కర్ణాటక ప్రగతిపరంగా ఉందన్నారు. సమావేశంలో పాల్గొన్న వారు తమ జ్ఞాన నైపుణ్యతను వేదికపై పంచుకోవడం ద్వారా భవిష్యత్తు రూపకల్పన, పరివర్తనకు కారకులు అవుతారన్నారు.

ఐదేళ్ల క్యాలెండర్‌తో దిశానిర్దేశం

బెంగళూరు టెక్ సమ్మిట్ అనేది ఒక సభ, సమావేశంలా కాకుండా కొత్త అంశాలు, పెట్టుబడులు, ఆవిష్కరణలు, మార్పునకు వేదిక అవుతోందన్నారు. కర్ణాటక ఐటీ పాలసీ, స్పేస్‌టెక్నాలజీ పాలసీ, స్టార్టప్ పాలసీలను ఐదేళ్లపాటు ఒక క్యాలెండర్ రూపంలో అమలు చేసేలా చారిత్రాత్మక సాంకేతిక నిర్దేశం చేశామన్నారు. ఆధునిక సాంకేతికతలో రాష్ట్రంలో స్టార్టప్, డీప్‌టెక్‌లకు ప్రపంచ స్థాయిలో లక్ష్యాలను కలిగి ఉందన్నారు. 2034 నాటికి కర్ణాటక దేశంలోనే అంతరిక్ష సాంకేతిక కేంద్రంగా పరివర్తన కల్పించడమే మా లక్ష్యమన్నారు. అందుకే స్పేస్‌టెక్ పాలసీ తీసుకొచ్చామన్నారు. కొత్త స్టార్టప్ పాలసీలకు రానున్న ఐదేళ్లు ఆర్థికసాయం, మార్కెటింగ్ అవకాశం, మౌలిక సదుపాయాలు, నైపుణ్యత చర్యల ద్వారా 25వేల స్టార్టప్‌లకు సహకరించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. టెక్ సమ్మిట్‌లో 600మందికిపైగా అంతర్జాతీయ ప్రసంగీకులు, 1200మంది ఎగ్జిబిటర్స్, 60కుపైగా దేశాల ప్రతినిధులు భాగస్వామ్యులయ్యారన్నారు. రానున్న దశాబ్దంలో సాంకేతిక రూపురేఖలను కొత్త అవకాశాలను ఇక్కడే చర్చించాలని, కర్ణాటక, భారత్‌కోసం మాత్రమే కాకుండా ప్రపంచానికే ఆవిష్కరణలకు వేదిక కావాలన్నారు. కృత్రిమ మేధస్సు క్వాంటమ్, ఏరోస్పేస్, బయోటెక్, గ్రీన్‌టెక్‌ల ద్వారా డిజిటల్ యుగంలో ఉన్నామన్నారు. మానవ పరివర్తనాత్మక భవిష్యత్తును సృష్టించేందుకు విశ్వానికే కర్ణాటక ఆహ్వానంగా ఉందన్నారు.

పారిశ్రామిక శక్తిగా బెంగళూరు...

దశాబ్దాలుగా బెంగళూరుకు సిలికాన్ వ్యాలీ అనే పేరు ఉందని, ప్రస్తుతం అంతకుమించిన స్టార్టప్, ఏఐ రంగాలలో పేరు సాధించిందన్నారు. కర్ణాటకలో 85 యూనివర్సిటీలు, 243 ఇంజనీరింగ్ కళాశాలలు, 1800 ఐటీఐలు ఉన్నాయని తద్వారా గుణాత్మకమైన విద్య, తగిన ఉద్యోగాలు సాధ్యమవుతున్నాయన్నారు. రాష్ట్రంలో 4.3శాతం నిరుద్యోగ ప్రమాణం ఉందన్నారు. బెంగళూరులో ఐఐఎస్‌సీ, ఐఐటీ, నిమ్హాన్స్, డీఆర్‌డీఓ, ఇస్రో వంటి కేంద్రాల ద్వారా ఎన్నో సాధనలు సాధ్యమవుతున్నాయన్నారు. పారిశ్రామిక శక్తిగా బెంగళూరు సాగుతోందని, 1600కుపైగా స్టార్టప్‌లు ఉన్నాయని, దేశంలోని స్టార్టప్‌లలో రాష్ట్రంలో 47శాతం ఉన్నాయన్నారు. ఐటీ ఎగుమతులలో జాతీయస్థాయిలో 42శాతం కర్ణాటకనుంచే ఉందని, వీటి విలువ రూ.3.2లక్షలకోట్లకంటే ఎక్కువ ఉందన్నారు. ఏటా ఈ ప్రగతి పరుగులు తీస్తోందన్నారు. గ్లోబల్ టెక్నాలజీ రంగంలో కర్ణాటక క్రియాశీలకంగా ఉందన్నారు. క్వాంటమ్ టెక్నాలజీకి ప్రాధాన్యం ఇచ్చిన తొలిరాష్ట్రమన్నారు. సాంకేతికత, అవకాశాలను ఉపయోగించుకునేందుకు పెట్టుబడులతో రావాలన్నారు. ఇదే సందర్భంగా కియోె పీసీ ప్రాసెసర్‌ను లాంఛనంగా ఆవిష్కరించి రూ.18,999గా ధర నిర్ణయించారు. ఐటీబీటీ శాఖ కార్యదర్శి మంజుల, బయోకాన్ చైర్మన్ కిరణ్ మజుందార్‌షా, కియోనెక్స్ చైర్మన్ శరత్ బచ్చేగౌడ, ఎస్‌టీపీఐ డైరెక్టర్ జనరల్ అరవిందకుమార్, పోలెండ్ డిప్యూటీ మినిస్టర్ రఫల్ రసిన్‌స్కి, ఆస్ట్రేలియా లార్డ్ ఆఫ్ మేయర్ నికోలస్ రినీ, నార్వే హెల్త్‌కేర్ సర్వీసెస్ మినిస్టర్ జాన్ క్రిస్టియన్ వెస్ట్రే, జర్మనీ బవేరియన్ పార్లమెంట్ ప్రెసిడెంట్ హిల్డే ఐగ్నేర్‌తోపాటు వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.





సదస్సులో రోబోల ప్రదర్శన



సదస్సు వేదికపై సీఎం, డీసీఎం ఇతర ప్రముఖులు



పాల్గొన్న వివిధ సంస్థల ప్రతినిధులు



స్పేస్‌టెక్ స్టాల్‌ను తిలకిస్తున్న సీఎం



సదస్సులో పాల్గొన్న యువత



సదస్సుకు విచ్చేస్తున్న ప్రతినిధులు

ఢిల్లీ వెళ్లినా.. మార్పులు లేనట్టే..

బెంగళూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనాలు ఉంటాయని, ఎటువంటి నిర్ణయమైనా జరగవచ్చునని రాష్ట్ర పార్టీ నాయకులు భావించారు. అందుకు అనుగుణంగానే కొన్ని పరిణామాలు చోటుచేసుకున్నాయి. 15న ఢిల్లీ వెళ్లి మంత్రివర్గ విస్తరణకు అనుమతులు తీసుకొస్తానని స్వయానా సీఎం సిద్దరామయ్య రెండువారాలక్రితమే ప్రకటించారు. మరికొందరు ఇదే ముహూర్తమని డీసీఎం డీకే శివకుమార్‌కు కీలకమైన పదవి సాధ్యమవుతుందన్నారు. ఇలా మలుపులు తిరిగాయి. మూడురోజులపాటు సీఎం, డీసీఎంలు ఢిల్లీలో ఉండడంతో వివాదం మరింత రచ్చే అయ్యింది. ఏ క్షణంలో ఎటువంటి సంచలన నిర్ణయమైనా బహిరంగం కావచ్చునని భావించారు. ఇలా మూడురోజులపాటు సాగిన ఉత్కంఠకు తెరపడింది. 15న సీఎం సిద్దరామయ్య ఢిల్లీ వెళ్లి ఒంటరిగా రాహుల్‌గాంధీని కలిశారు. కాసేపటికే డీసీఎం డీకే శివకుమార్ కూడా ఢిల్లీ చేరుకున్నారు. రాహుల్‌గాంధీ నేరుగా సిద్దరామయ్యను మళ్లెప్పుడు వస్తారు, అగ్రనేతలు ఖర్గే, కేసీ వేణుగోపాల్‌తో చర్చించాలని సూచించారు. సోమవారం ప్రధానమంత్రితో అపాయింట్‌మెంట్ ఉందని, ఢిల్లీలో అందుబాటులో ఉంటానని రాహుల్‌గాంధీకి వివరించారు. దీంతో ఖర్గే తీసుకునే నిర్ణయం అమలవుతుందని భావించారు. ఈలోగా మూడు రోజులు ఢిల్లీలోనే గడిపిన డీకే శివకుమార్, ఆయన సోదరుడు డీకే సురేశ్‌లు ఖర్గేను కలిశారు. సోమవారం ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి తొలుత ప్రధానితో కలసి, ఆ తర్వాత రాత్రి మల్లికార్జున ఖర్గేను భేటీ అయ్యారు. సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ప్రధానంగా రాహుల్‌గాంధీ సూచించిన అంశాలను ప్రస్తావించినట్టు తెలిసింది. ప్రస్తుతానికి ఎటువంటి చర్యలు వద్దంటూ సున్నితంగా ఖర్గే తిరస్కరించినట్టు తెలుస్తోంది. దీన్నిబట్టి ప్రస్తుతానికి మంత్రివర్గ ప్రక్షాళన, విస్తరణ వంటి అన్ని అంశాలకు తెరపడినట్టు అయ్యింది. ఒకవేళ అధిష్ఠానం అంగీకరించినా మరో 15రోజుల్లో బెళగావిలో శాసనసభ శీతాకాల సమావేశాలు ఉన్నందున ఆ తర్వాతనే విస్తరణ చేయాలని ఆలోచించారు. రాష్ట్రంలో రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలన ముగుస్తున్న తరుణంలో ఎటువంటిమార్పులు, సంచలనాలు లేవని అధిష్ఠానం తేల్చేసింది.



డీకే శివకుమార్, సిద్దరామయ్య

పాఠశాలను దత్తత తీసుకున్న తెలుగు విజ్ఞాన సమితి



బస్సుపాసులతో విద్యార్థులు, సమితి పదాధికారులు

బెంగళూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శివాజీనగర్ బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ తెలుగు పాఠశాలను దత్తత తీసుకుని మౌలిక సదుపాయాలు సమకూర్చాలని నిర్ణయించినట్టు తెలుగు విజ్ఞాన సమితి అధ్యక్షుడు రాధాకృష్ణరాజు తెలిపారు. 8 నుంచి 10 తరగతుల విద్యార్థులకు మంగళవారం సమితి కార్యవర్గ సభ్యుడు గణేశ్‌శంకర్ సహకారంతో బస్‌పాస్‌లను అందించారు. కార్యవర్గ సభ్యుడు గణేశ్‌శంకర్‌ను అభినందించారు. రాధాకృష్ణరాజు మాట్లాడుతూ శివాజీనగర్ ఓపీహెచ్ రోడ్డులోని పాఠశాలను దత్తత తీసుకుని రూ.16లక్షలతో అన్ని సదుపాయాలను సమకూర్చామన్నారు. తెలుగుభాష భావితరాలలోనూ కొనసాగాలని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తామన్నారు. విద్యాశాఖ మంత్రి మధుబంగారప్పను కలసి ఉపాధ్యాయుల నియామకం విషయమై చర్చిస్తామన్నారు. తెలుగు పాఠశాల ఉనికికోసం సమితి కట్టుబడి ఉందన్నారు. గతంలో బెంగళూరు జిల్లా వ్యాప్తంగా 130 తెలుగు విద్యాసంస్థలు ఉండేవని, ప్రస్తుతం 13కు తగ్గాయని, విద్యార్థుల సంఖ్య 6వేలకు పడిపోవడంపై విచారం వ్యక్తం చేశారు. ఎస్‌ఎస్‌ఎల్‌సీలో 90శాతంకంటే ఎక్కువమార్కులు సాధిస్తే రూ.5వేల నగదు బహుమతి అందిస్తామని సమితి కోశాధికారి వరదరాజు ప్రకటించారు. పాఠశాల హెచ్‌ఎం మన్సూల్ తోపాటు సమితి సభ్యులు వెంకటేశులు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శ్యామల పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పెంపే లక్ష్యం..!

- ప్రతి జిల్లాకు చైతన్య రాయబారులు
- జూన్ దాకా అవగాహన కార్యక్రమాలు

బెంగళూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏటా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. ఇందుకు పలు కారణాలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రైవేట్ విద్యాసంస్థలు తెరుస్తుండడమే ప్రధాన కారణాలుగా ఉన్నాయి. కొన్ని వందలకొద్దీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయులు ఉన్నారు. వారు ఐదు తరగతులకు అటెండెన్స్ వేయడం, మధ్యాహ్న భోజనం పర్యవేక్షించడం వంటివి అదనపు పనులకే 3-4గంటలు కేటాయించాల్సి వస్తోంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాఠశాలలు కొనసాగుతున్నా కనీసం 4 గంటలపాటు ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించేందుకు తగిన సమయం సాధ్యం కావడం లేదు. ఒకప్పటిలాగా ఒక ఇంట్లో ఆరేడుగురు పిల్లలు లేరు. ఒకరు లేదా ఇద్దరు మాత్రమే సంతానంగా ఉండడంతో కష్టమైనా మంచి చదువు అందించాలని తల్లిదండ్రులు భావిస్తున్నారు. దీంతో కనీస సౌకర్యాలు లేని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ప్రభుత్వం కూడా సాధారణ పాఠశాలలంటే విద్యార్థులు రావడమే కష్టమవుతోందని కర్ణాటక పబ్లిక్ స్కూల్స్ (కేపీఎస్), ప్రధాన మంత్రి స్కూల్ (పీఎంశ్రీ) వంటి విద్యాసంస్థలను ప్రారంభిస్తున్నారు. ఒకప్పుడు గ్రామం నుంచి తాలూకా కేంద్రం దాకా ప్రభుత్వ విద్యాసంస్థలే ఉండేవి. ఎవరు చదవాలన్నా అక్కడి పాఠశాలలోనే చేరేవారు. కానీ ప్రైవేట్ విద్యాసంస్థలు, రెసిడెన్షియల్ స్కూల్స్ పెరిగిపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరిక తగ్గిపోతోంది.

● నూతన విధానాలపై విద్యాశాఖ కసరత్తు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు విద్యాశాఖ కొత్త విధానాలను పాటించేందుకు సిద్ధమైంది. 2026-27 విద్యాసంవత్సరంలో కేపీఎస్, పీఎంశ్రీ పాఠశాలల్లో 20శాతం, ఇతర ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కనీసం15శాతం విద్యార్థుల సంఖ్యను పెంచదలిచారు. రాష్ట్రప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రస్తుత విద్యాసంవత్సరంలో 40లక్షలమంది చదువుతున్నారు. సరిగ్గా పదేళ్లక్రితం ఈ సంఖ్య 60లక్షలదాకా ఉండేది. పదేళ్లలో పిల్లల సంఖ్యలో భారీ తేడా లేకున్నా ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివేవారి సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఉచితంగా యూనిఫాం, పాఠ్యపుస్తకాలతోపాటు పలు సౌకర్యాలు కల్పిస్తున్నారు. అయినా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఈ పరిణామం సీరియస్‌గా తీసుకోకుంటే మరో పదేళ్లలో వందలాది విద్యాసంస్థలను మూసివేసే పరిస్థితి ఏర్పడనుంది. దీంతో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు నవంబరు 14న హాజరు జాగృతి అభియానను ప్రభుత్వం ప్రారంభించింది. 2026-27 విద్యాసంవత్సరం ప్రారంభం జూన్ వరకు అభియానను కొనసాగించనున్నారు. ఈ చైతన్యంలో లక్ష్యాన్ని అధిగమించే ఐదుగురు డిప్యూటీ డైరెక్టర్‌లు (పాలనా), క్షేత్రస్థాయి విద్యాశాఖ అధికారులు, ప్రాథమిక, హైస్కూల్ హెడ్మాస్టర్‌లు, పీయూ కళాశాలల ప్రిన్సిపాళ్లకు విదేశాల తరహాలో అధ్యయనం చేసేందుకు అవకాశం కల్పిస్తామని విద్యాశాఖ సూచించింది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో గుణాత్మకమైన విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, పిల్లల్లో నైపుణ్యత, ప్రగతిని తల్లిదండ్రులు, సమాజంముందు ప్రదర్శించేలా పిల్లల నైపుణ్యతా సంబరాన్ని డిసెంబరు 12నుంచి 17వరకు ఐదు రోజులపాటు అమలు చేసేలా విద్యాశాఖ సూచించింది.



మేలుకోటెలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల



కిక్కేరిలోని కర్ణాటక పబ్లిక్ స్కూల్

● ప్రతి జిల్లాకు విద్యారాయబారి

ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి చైతన్యం కలిగించేందుకు ప్రతి జిల్లాకు విద్యారాయబారిని నియమించదలిచారు. ప్రభుత్వ పాఠశాలల సాధనలకు సంబంధించి ఆర్ట్, ఆడియోలు, పోస్టర్‌లు, చార్ట్‌లు, యక్షగానం, హరికథ, జానపద గేయాలు, వీధి నాటకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల, కళాశాలలపట్ల చైతన్యం తీసుకురావాలని నిర్ణయించారు. పాఠశాల, కళాశాల స్థాయిలో డ్రాపౌట్‌లను గుర్తించి మళ్లీ వారిని చదువుకునేలా ప్రోత్సహించేందుకు ప్రజాప్రతినిధుల సహకారంతో వేసవి శిబిరాన్ని ఏర్పాటు చేయదలిచారు.

● విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యం

ఈ అభియానలో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం, 2026-27 విద్యాసంవత్సరంలో కేపీఎస్, పీఎంశ్రీలలో 25శాతం, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో 15శాతం విద్యార్థుల సంఖ్యను పెంచదలిచారు. జిల్లాకో రాయబారిని నియమించి అతడి ద్వారానే గ్రామీణ ప్రాంతాలు, పట్టణంలోని మురికివాడలు తదితర ప్రాంతాలలో అర్థమయ్యే రీతిలో నాటకాలు, ఇతరత్రా కళల ద్వారా ప్రదర్శనలు ఏర్పాటు చేయదలిచారు. దీనికితోడు ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, పాఠశాలల్లో శౌచాలయాలు, తరగతి గదులు నిర్మించాలని ప్రతిపాదనలు ఉన్నాయి. దివ్యాంగ చిన్నారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం, ఉపాధ్యాయులు, అధ్యాపకుల బదిలీలు విద్యాసంవత్సరానికి ముందే అమలు చేయడం ఉపాధ్యాయులకు బోధనల పనులు మినహాయించి, అదనపు బాధ్యతలను తగ్గించడం పాఠశాల అభివృద్ధి కమిటీ (ఎస్‌డీఎంసీ)లను బలోపేతం చేయాలని భావిస్తున్నారు.

బాలల హక్కుల కార్యకర్త నరసింహారావు అభిప్రాయం మేరకు ప్రభుత్వ పథకాలు అమలు చేసేందుకు అత్యవసరంగా ప్రణాళికలు రూపొందించడం, వాటిని అమలు చేయడం ముఖ్యమన్నారు. అన్ని ప్రభుత్వశాఖలు సమన్వయంతో పనిచేయాల్సి ఉందన్నారు. పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి శుభమంగళ అభిప్రాయం మేరకు పాఠశాలలు, కళాశాలల్లో డ్రాప్ అవుట్‌లను గుర్తించి మళ్లీ వారిని బడులలో చేర్పడానికి ప్రాధాన్యం ఇవ్వనున్నామన్నారు.



కాడుగుడిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

పరిశోధనా రంగానికి విద్యాశంకర్ అంకితం

- వీసీ డాక్టర్ పరమశివమూర్తి



విద్యాశంకర పురస్కారాలు అందుకున్న డాక్టర్ సంగమేశ సవదత్తిమఠ, డాక్టర్ జయలలిత

బెంగళూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కన్నడభాషలో పరిశోధకుల పరంపర సాగిందనీ, వీరశైవ సాహిత్య చరిత్ర ఐదు సంపుటాలుగా రచించిన డాక్టర్ విద్యాశంకర్ జీవితకాలంలో కీలకమైన సమయాన్ని అంకితం చేశారని కన్నడ హంపి విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ డీవీ పరమశివమూర్తి అభిప్రాయపడ్డారు. మంగళవారం డాక్టర్ ఎస్ విద్యాశంకర్ సాంస్కృతిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ సంగమేశ సవదత్తిమఠకు విద్యాశంకర ప్రశస్తిని, డాక్టర జయలలితకు విద్యాశంకర పురస్కారాలను ప్రదానం చేశారు. పరమశివమూర్తి మాట్లాడుతూ.. కన్నడ సాహిత్య పరిశోధకుల్లో గోవిందపై, శంభాజోషి, ఎంఎం కలబురగి, చిదానందమూర్తి ప్రముఖులన్నారు. కన్నడ భాషా సంస్కృతి విస్తరణకు కృషి చేశారన్నారు. విద్యాశంకర్ 76 అమూల్యమైన గ్రంథాలను కన్నడకు అంకితం చేశారన్నారు. ప్రస్తుతం యువత పరిశోధనా సాహిత్యంవైపు ఆసక్తి చూపడం లేదని విచారం వ్యక్తం చేశారు. కన్నడ సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షులు నల్లూరు ప్రసాద్, నిడుమామిడిమఠం వీరభద్రచన్నమల్లస్వామిలు ప్రసంగించారు. ఫౌండేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ కావెం శ్రీనివాసమూర్తి స్వాగతం పలకగా విద్యాశంకర్ భార్య నాగరత్న, పిల్లలు మహేశ్‌కార్తిక్, ప్రియదర్శినిలు పాల్గొన్నారు. ఎరస్వామి బృందం సుగమసంగీతాన్ని ప్రదర్శించారు. ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ రుద్రేశ్ అదరంగి కార్యక్రమ పర్యవేక్షకులుగా వ్యవహరించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1624.34	1630.89
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,746	3,590
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	7,344	7,325
నీటి నిల్వ (టీఎంసీలు)	74.36	97.45

నవ బృందావనంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న సుబుదేంద్ర తీర్థ మహాస్వాములు

కంప్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తాలుకా పరిధిలోని ఆనెగొంది తుంగభద్ర నది మధ్యలో వెలిసిన బృందావనంలో మంగళవారం రాఘవేంద్రస్వామి ఆలయ మఠాధిపతులు సుబుదేంద్ర తీర్థ మహాస్వాములు చేతుల మీదుగా ప్రత్యేక పూజలు జరిగాయి. మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు నవ బృందావనంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు సమితి సభ్యులు తెలిపారు.

బైక్ యజమానికి రూ.25 వేలు జరిమానా

బళ్లారి గాంధీనగర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మైనర్‌కు మోటారు సైకిల్‌ను నడిపేందుకు ఇచ్చిన కారణంగా వాహన యజమానికి జిల్లా కోర్టు రూ.25 వేలు జరిమానా విధించినట్లు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముర్తుజా సాబా ఒక ప్రకటనలో తెలిపారు. ఆ యజమానిపై బళ్లారి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదుచేశారు. ఇందుకు సంబంధించి మంగళవారం కోర్టు విచారణ సమయంలో నిందితుడు తప్పును అంగీకరించడంతోపాటు మోటారు వాహన చట్టాన్ని ఉల్లంఘించినందుకు బళ్లారి 3వ ఏసీజే, జేఎంఎఫ్‌సీ కోర్టు న్యాయాధికారి ముదుకప్ప ఓదన్ బైక్ యజమాని రాజుకు రూ.25 వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు.

పార్కుల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

హోస్పేట్, నవంబరు18(ఆంధ్రజ్యోతి) కేంద్ర ప్రాయోజిత అమృత యోజన నాన్ టెక్నికల్ ప్రోగ్రామ్ కింద కొత్తూరు పట్టణ పంచాయతీలో ఉన్న ఐదు పార్కుల నిర్వహణ బాధ్యతలను మహిళ స్వయం సహాయక సంఘాలకు అప్పగించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పట్టణ పంచాయతీ ముఖ్య అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. దయాళ్ ప్రచారం కింద ఎంఐఎస్‌లో నమోదు చేసుకున్న అర్హతగల మహిళా సంఘాలు మాత్రమే అర్హులని అని తెలిపారు. ఆసక్తిగల సంఘాలు పట్టణ పంచాయతీ కార్యాలయంలోని డీఏఎన్ఈఎల్ఎం శాఖను సంప్రదించి దరఖాస్తులు పొందాలన్నారు. అవసరమైన పత్రాలతో 25వ తేదీలోపు సమర్పించాల్సి ఉంటుంది తెలిపారు.

ఏఐ వాస్తవ నిర్ధారణ శిక్షణకు..

హోస్పేట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి) సాంకేతిక విప్లవం వేగంగా మారుతున్న ఈ యుగంలో జర్నలిజం కొత్త దిశల్లోకి అడుగు పెడుతోంది. బళ్లారి, విజయనగరం జిల్లాలో షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్ తెగలకు చెందిన వార్తాపత్రిక సంపాదకుల కోసం ఒకరోజు ప్రత్యేక శిక్షణ వర్క్‌షాప్‌ను కర్ణాటక మీడియా అకాడమీ నిర్వహిస్తోంది ఈ శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అకాడమీ అధ్యక్షులు ఆయేషా ఖానం తెలిపారు. 29వ తేదీ ఈశిక్షణ జరగనుందన్నారు. 50 మంది ఎడిటర్లను ఎంపిక చేయనున్నట్లు, ఇందులో 35 మంది ఎస్.సి, 15 మంది ఎస్టీ వర్గాలకు చెందిన ఎడిటర్లకు అవకాశం ఉంటుందన్నారు. దరఖాస్తులు 21వ తేదీ లోపు చేసుకోవాలని సూచించారు. గూగుల్ ఫారం ద్వారా తమ వివరాలు, డిపార్ట్‌మెంటల్ మీడియా లిస్ట్ కాపీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, ఓటర్ ఐడీ పత్రాలను ఇవ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల వార్తాపత్రికల ఎడిటర్లు మాత్రమే ఈ శిక్షణకు అర్హులని ఆమె తెలిపారు.

25న దివ్యాంగుల క్రీడా పోటీలు

హోస్పేట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని డిసెంబరు 3న జరగబోయే కార్యక్రమాల్లో భాగంగా 25వ తేదీన క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వికలాంగుల సంక్షేమ అధికారి రామంజనేయ తెలిపారు. హోస్పేట్‌లోని జిల్లా స్టేడియంలో క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో పాల్గొనదలచినవారు 24వ తేదీలోగా తమ పేర్లను తాలూకా స్థాయి బహుళార్థసాధక పునరావాస కార్యకర్తల (ఎంఆర్‌డబ్ల్యూఎస్) వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఒక వ్యక్తి ఒక్క పోటీలో మాత్రమే పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు.

పథకాలను వినియోగించుకోండి

సిరుగుప్ప, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కట్టడకార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి బాటలో నడవాలని ఎమ్మెల్యే బీఎం నాగరాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని అభయాంజనేయస్వామి ఆలయ ఆవరణలో మొబైల్ క్లినిక్ వాహన సంచారసేవలకు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కట్టడ కార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రమాదబారిన పడితే తక్షణమే వాహనసేవలను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ తిరుమలేష, మేనేజర్ హనుమంతప్ప, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కట్టడ కార్మికులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ల సీజ్

రాయచూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సింధనూరు తాలూకా తుర్విహాళ్ పోలీసులు మంగళవారం నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న మూడు ఇసుక టిప్పర్లను సీజ్ చేశారు. కొప్పళ జిల్లా కనకగిరి తాలూకా నవలగి గ్రామం నుంచి ఉమలూటి గ్రామం గుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం తెలుసుకున్న తుర్విహాళ్ పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేపట్టడంతో మూడు టిప్పర్లు పట్టుబడ్డాయి. ఈ మూడింటికి నంబర్ ప్లేట్లులేని విషయాన్ని గమనించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

నందనవన పార్కుపై బడా నేతల కన్ను

- అక్రమించేందుకు కుట్ర
- సివిల్ సర్వీస్ అసోసియేషన్ ఆగ్రహం



మాట్లాడుతున్న అసోసియేషన్ సభ్యులు

బళ్లారి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజల ఊపిరితిత్తుల్లాంటి నందనవన పార్కుపై ప్రభావవంతుల కన్ను పడింది. నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ 35వ వార్డులో ఉన్న ఈ పార్కును ఓ న్యాయవాది, రాజకీయ నాయకుడు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానిక వీరన్నగౌడ కాలనీ, గణేష్‌నగర్ సివిల్ సర్వీస్ అసోసియేషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు కె.బసవనగౌడ, ఉపాధ్యక్షుడు వి.విరేష్ మాట్లాడారు. వీరన్నగౌడ కాలనీ టీఎస్ నంబర్ 350/133లో ఉన్న ఈ పార్కు పదేళ్లుగా ఎం.రాజేశ్వరి నగర్ నుంచి సంజయగాంధినగర్ ప్రాంతాల ప్రజలు వినియోగిస్తున్నారని తెలిపారు. ప్రజల పార్కును ప్రైవేట్ డెవలపర్‌కు తాకట్టు పెట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. న్యాయవాది ధారవాడ హైకోర్టు నుంచి స్టే తెచ్చారని, ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకమని, చట్టపరంగా పోరాడతామని, అవసరమైతే స్టేను చాలెంజ్ చేస్తామని వారు స్పష్టం చేశారు. పార్కును కాపాడటం రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత అని పౌరుల హక్కులను కపాడకపోతే నిరసనలు తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. పార్కు ఒక్క అంగుళం కూడా ఇవ్వమని, ఇది మా పిల్లలకి, మా పెద్దలకి మా ఆరోగ్యానికి సంబంధించినదనివారు అన్నారు. సమావేశంలో కార్యదర్శి బసవన్నగౌడ్, సంయుక్త కార్యదర్శి కె.విజయసింహ, కోశాధికారి శరణగౌడ, డాక్టర్ టి.సురేష్, మురళీ శ్యామ్, గొట్టిపాటి, మందపాటి సత్యనారాయణరాజు, హేమంత్‌కుమార్, వీనాగౌడ, హెచ్.జయప్రదగౌడ, ఉమేష్, వీరనగౌడ, శరణ బసవనగౌడ పాల్గొన్నారు.

దివ్యాంగులకు పింఛన్ పెంచాలి

- ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగప్ప దాసర్



మాట్లాడుతున్న రంగప్ప దాసర్

బళ్లారి సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇస్తున్న దివ్యాంగ పింఛన్‌ను పెంచాలని పెంచాలని దివ్యాంగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగప్ప దాసర్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని పత్రికా భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొన్నేళ్లుగా పింఛన్ పెంపుదల, దివ్యాంగుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. బెంగళూరులోని ఫ్రీడం పార్క్‌లో జరిగిన రాష్ట్రస్థాయి నిరసనలో ప్రభుత్వం జోక్యం చేసుకుని మీ డిమాండ్‌ను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. కానీ నేటికీ చర్చలకు పిలవకపోవడం ప్రభుత్వం వాగ్దానాన్ని ఉల్లంఘించడమే అన్నారు. 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి పింఛన్ ప్రధాన ఆధారమైనా, ప్రభుత్వం దానిని తీవ్రంగా పరిగణించలేదనే వాస్తవాన్ని ఆయన సమర్థించారు. విద్య, ఉపాధి అవకాశాలను కోల్పోయిన వేలాదిమంది దివ్యాంగులు ప్రభుత్వం అందించే రూ.800 నుంచి రూ.1,400 పింఛన్‌తో జీవిస్తున్నారన్నారు. రాష్ట్రప్రభుత్వం హామీ పథకాలను అమలు చేసినా, దివ్యాంగుల హామీని మరిచిపోయిందని విమర్శించారు. దివ్యాంగుల పింఛన్ కనీసం రూ.10,000 నిర్ణయించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. వికలాంగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా భారీ నిరసన ప్రదర్శన చేపడతామని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కుమారప్ప, వరలక్ష్మి, ఎర్రిస్వామి, పార్వతి బాయి, నాగునాయక్, రాజనాయక్, బంగారప్ప పాల్గొన్నారు.

చర్చా పోటీలతో జ్ఞానాభివృద్ధి: ప్రొఫెసర్ మునిరాజు



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ మునిరాజు

బళ్లారి సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చర్చాపోటీల్లో పాల్గొనడం ద్వారా జ్ఞానం అభివృద్ధి చెందుతుందని ప్రొఫెసర్ ఎం. మునిరాజు అన్నారు. మంగళవారం విశ్వవిద్యాలయంలోని అంబేడ్కర్ హాల్లో విద్యార్థి సంక్షేమ విభాగం, రాష్ట్ర సహకార సమాఖ్య సహకారంతో అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల కోసం నిర్వహించిన సహకార రంగంపై చర్చా పోటీ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పోటీతత్వం అనేది ప్రతిచోటా అవసరమైన అంశమన్నారు. విద్యార్థులు వర్తమాన వ్యవహారాలు లేదా గాంధీజీ, అంబేడ్కర్ వంటి వ్యక్తులకు సంబంధించిన అంశాలను ఎంచుకొని, వాటిని ఒకరితో ఒకరు చర్చించుకుని సమూహాలలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు సహాయపడతాయన్నారు. ఈసమయంలోనే చర్చా పోటీలు వ్యక్తులు దేశ భవిష్యత్తు, అభివృద్ధికి దారిచూపేవిగా మారుతాయన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల డీన్‌లు, విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎలుగుబంట్ల దాడులతో నష్టపోతున్న రైతులు

బళ్లారి గాంధీనగర్/సిటీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సండూరు తాలూకా చుట్టుపక్కల విస్తారంగా కొండ, అటవీ ప్రాంతాలు, అధిక సంఖ్యలో వన్యప్రాణులు నివాసం ఉంటున్నాయి. ఇందులో ఎక్కుగా ఎలుగుబంట్లు ఉన్నాయి. రాత్రివేళల్లో గుంపులు గుంపులుగా ఎలుగబంట్లు సమీప పంటపొలాల్లోకి చొరబడి పంటలను నాశనం చేస్తున్నట్లు ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఎలుగుబంట్లు రైతులపై దాడులు చేసినపుడు మాత్రమే అటవీశాఖ అధికారులు మేల్కొని వాటిని పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. తాలూకా పరిధిలోని డి.అంతాపుర గ్రామంలో హొన్నూరప్పకు చెందిన మొక్కజొన్న పంటపై ఎలుగుబంట్లు దాడి చేసి నాశనం చేశాయి. సమస్య తనొక్కడిదే కాదని, తాలూకా పరిధిలో కొండ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న పంటపొలాల రైతులందరిదీ అని వాపోతున్నారు. అటవీశాఖ అధికారులు పరిస్థితిని గమనించి నష్టపోయిన పంటపొలాలను పరిశీలించి రైతులకు పరిహారం అందించేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.



దెబ్బతిన్న మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు హొన్నూరప్ప

6.895 కిలోల గంజాయి స్వాధీనం

కంప్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గంగావతి తాలుకా పరిధిలో రెండు రోజులుగా ఆరు కిలోల 895 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకన్నారు. ఎస్పీ డాక్టర్ రామ్ ఎల్ అరసిద్ధి, అడిషనల్ ఎస్పీ హేమంత్ కుమార్ నేతృత్వంలో డీవైఎస్పీ న్యాయగౌడరు, సీఐ రంగప్ప, దొడ్డమనే ప్రకాష్, వెంకటేష్ చౌహాన్ పోలీసు బృందంతో గంజాయిపై సోదాలు చేపట్టారు. గంగావతి పట్టణంలో గౌసియా కాలనీలో గంజాయి అమ్ముతున్న ఇద్దరి నుంచి కిలో 125 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం చిక్క జింతగల్ మారెమ్మ దేవస్థానం వద్ద కంప్లి వైపు నుంచి వస్తున్న కారును తనిఖీ చేయగా ఐదు కిలోల 770 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్పీ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గంగావతి పట్టణంలో గౌసియా కాలనీ ప్రాంతంలో గంజాయి అమ్ముతున్న సోహెల్ హనీఫ్ ఒక కిలో 125 గ్రాములు, చిక్కజంతిగల్ వద్ద కారులో 5.770 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కారులో వస్తున్న వారు గుంతకల్లుకు చెందిన గోపాల్, మస్తాన్, మహబూబ్, శేఖర్‌లపై పట్టణ పోలీసు స్టేషన్లో కేసు నమోదైనట్లు తెలిపారు. మొత్తం ఆరు కిలోల 895 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.3.36 లక్షలు ఉంటుందన్నారు. కొప్పళ జిల్లాలో ఇప్పటికే ప్రతి స్టేషన్లో గంజాయి కేసులు నమోదు చేశామన్నారు. జిల్లా మొత్తం 45 కేసులు నమోదయ్యాయన్నారు. డ్రగ్స్ ముక్త జిల్లాగా మారుస్తామన్నారు. గత రెండు రోజులు క్రితం యలబుర్గ వద్ద మహిళపై అత్యాచారానికి పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. పట్టణాలు, గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు తమ ప్రాంతాల్లో కనిపించిన వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. యువతరం డ్రగ్స్ మోజులో పడి పూర్తిగా ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. దాడుల్లో పాల్గొన్న సిబ్బంది సిద్దం గౌడ రమేష్ హిట్నాల్ మల్లప్ప, ఇంగలదాల్ రాఘవేంద్ర, గుండప్ప, పూజారి శారదమ్మ, మారుతి, సయ్యద్ గౌస్, చిరంజీవి, మరి శాంతిగౌడ, విశ్వనాథ్, సుభాన్, గానెప్ప, యమనప్ప, మైలారప్పలను ఎస్పీ అభినందించి బహుమతులు అందించారు.



పట్టుబడిన గంజాయిని చూపుతున్న పోలీసులు

హోసూరు జోన్

ఎన్నికల హామీలు నెరవేర్చాలని డిమాండ్



నిరసన తెలుపుతున్న జాక్టో-జియో సంస్థ సభ్యులు

హోసూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ హోసూరు తాలూకా కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. జాక్టో-జియో సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలిపారు. నిరసనలో వివిధ సంస్థ అధికారులు పాల్గొని 2021 ఎన్నికల సమయంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన వివిధ వాగ్దానాలను తమిళనాడు ముఖ్యమంత్రి నెరవేర్చాలని డిమాండ్ చేశారు. విద్యావంతులైన యువతకు రెగ్యులర్ ఉద్యోగాలు కల్పించాలని, ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం సహ వివిధ డిమాండ్లను ముందుంచి నినాదాలు చేశారు.



20 టన్నుల బియ్యాన్ని పంపుతున్న అన్నదాన కమిటీ సభ్యులు

దీపోత్సవానికి 20 టన్నుల బియ్యం

హోసూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా హోసూరు సమీపాన బాగలూరులో మంజునాథ స్వామి ఆలయ లక్షదీపోత్సవం సందర్భంగా బాగలూరు అన్నదాన కమిటీ తరఫున 27వ వార్షిక అన్న సమారాధనకు బియ్యం, కూరగాయలు అందజేశారు. సూడాపురం, చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు విరాళంగా 20 టన్నుల బియ్యం, వివిధ రకాల కూరగాయలు, బెల్లం వంటివి నుండే ట్రక్కులలో సేకరించారు. మంగళవారం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కమిటీ సభ్యులు మరియు స్థానికులు పలువురు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో పిల్లలు, వృద్ధులకు అనారోగ్యం

హోసూరు, నవంబరు18(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరం కర్ణాటక రాష్ట్రానికి సమీపంలో ఉన్నందున అక్కడ నెలకొన్న చల్లని వాతావరణం హోసూరు ప్రాంతంలో కూడా ఏడాది పొడవునా ఉంటుంది. ఈ తరుణంలో హోసూరు, చుట్టుపక్కల ప్రాంతాలో కొన్ని వారాలుగా పగులు, రాత్రి విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. నాలుగైదు రోజులుగా ఆకాశం మోహావృతమై ఉంది, బలమైన చల్లని గాలితో కూడి ఉంటోంది. ఈ కారణంగా 90 శాతానికిపైగా ప్రజలు చల్లటి వాతావరణం సరిపడక శారీరక రుగ్మతలతో ఇబ్బంది పడుతున్నారు. జలుబు, జ్వరం, దగ్గ వంటి సమస్యలను పిల్లలు సమా వృద్ధులు సైతం ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రులలో ఎక్కడ చూసిన చికిత్సకోసం క్యూకడుతున్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

పదిలో సింగిల్ డిజిట్ ర్యాంక్ సాధించాలి

- కలెక్టర్ కవితా మన్నికేరి

హోస్పేట్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరంలో ఎస్ఎస్ఎల్సీ ఫలితాల్లో విజయనగరం జిల్లా సింగిల్ డిజిట్ ర్యాంక్ సాధించాలని కలెక్టర్ కవితా మన్నికేరి అన్నారు. మంగళవారం విజయనగరం స్టేడియంలో జరిగిన ఎస్ఎస్ఎల్సీ ఫలితాల సమీక్ష సిద్ధత సమావేశాన్ని కలెక్టర్ ప్రారంభించారు. నోడల్ అధికారి హలిబాది అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గతంలో జిల్లా 18వ స్థానంలో ఉండగా, ఈసారి సింగిల్ డిజిట్ లక్ష్యంగా పనిచేయాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. డిసెంబరులోపే పాఠ్యాంశాలు పూర్తిచేయాలని, లెర్నింగ్ బ్యాక్‌వర్డ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించారు. ఫలితాల్లో నిర్లక్ష్యం చూపిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ డైరెక్టర్ రామచంద్రప్ప మాట్లాడుతూ క్విజ్‌లు, చర్చలు, వ్యాసాల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంచాలన్నారు. బీఈఓలు శేఖరప్ప, మైలేష్ బెవూరు, ఎంఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాల 100శాతం ఫలితాలే లక్ష్యం పెట్టుకోవాలని సూచించారు.

ట్రస్ట్ సదుపాయాలు వినియోగించుకోండి



సుదర్శన హోమంలో పాల్గొన్న మాలధారులు

కంప్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గంగావతి తాలుకా హిరేజింతకల్ వద్ద శంఖచక్ర ఆంజనేయస్వామి ప్రసన్న పంపా విరుపాక్షి ఆలయం వద్ద ప్రణవ సేవా ట్రస్టు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని మాలధారులు సద్వినియోగపరచుకోవాలని కమిటీ ప్రముఖులు తాతయ్యస్వామి, మంజుస్వామి, రాఘవేంద్రస్వామి కోరారు. ట్రస్టు ద్వారా 16 నుంచి జనవరి 10 వరకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. అయ్యప్ప, ఆంజనేయ, శివ మాలధారులు ఇక్కడ ప్రత్యేకించి స్వచ్ఛందంగా పరిశుభ్రంతో దైవభక్తితో అన్నప్రసాదాలు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా అన్నదాతలు మాలధారులకు అన్నదానం చేయాలని అనుకునే వారు రూ.6500 చెల్లించాలన్నారు. ఆరోజు వారి పేరుతో మాలధారులకు అన్నదానం చేస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు 9035103156 నంబరును సంప్రదించి తమ సమాచారాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు.

నూతన పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి

సిరుగుప్ప, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నూతన వ్యవసాయ పరిజ్ఞానాన్ని రైతులు పెంచుకోవాలని వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మంజునాథ రెడ్డి సూచించారు. మంగళవారం సిరుగుప్ప తాలుకాలోని బైరాపుర గ్రామ ఈరప్ప పొలంలో వ్యవసాయ పరిశోధనాస్థానం ఆధ్వర్యంలో నూతన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పాత వ్యవసాయ పద్ధతులను మరవాలన్నారు. నేటి రోజుల్లో అభివృద్ధి, పంట దిగుబడి రావాలంటే కొత్త పరిజ్ఞానం అవసరమన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు తీసుకుని ప్రతి రైతు అభివృద్ధి బాటలో నడవాలని కోరారు. అనంతరం రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించారు. రైతు ప్రముఖులు పాలయ్య, కరూరు వ్యవసాయాధికారి పురుషోత్తమరెడ్డి పాల్గొన్నారు.

అనారోగ్యంతో కళాకారుడు..

కంప్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన బూదిగుంప హుస్సేన్ సాబ్ అనే కళాకారుడు మంగళవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. కాంగ్రెస్ పార్టీలో వక్తర్, కన్నడ హిత రక్షణ సమితి తాలుకా ఉపాధ్యక్షులు మిమిక్రీ ఆర్టిస్టుగా, రంగ భూమి కళాకారుడుగా పేరు పొందారు. పలువురు నాయకులు, రంగభూమి కళాకారులు, హితరక్షణ సమితి సభ్యులు, పట్టణ వాసులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

దళితులపై దాడులను అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు

సిరుగుప్ప, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దళితులపై దాడులను అరికట్టాలని భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు కెంచనగుడ్డ అడివప్ప అన్నారు. మంగళవారం సీపీఐ పట్టణం నాయకుల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. వారు మాట్లాడుతూ బీజేపీ పరిపాలనలో దళితులు, వెనుకబడిన వర్గాలు, ఆదివాసీలపై దౌర్జన్యాలను ఖండిస్తూ హైస్కూలు గ్రౌండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ సిద్దార్థకు వినతిపత్రం అందించారు. అడివప్ప మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాలలో వెనుకబడిన వర్గాలు, దళితులపై దౌర్జన్యాలు, గూండాగిరి, రాజకీయ వైషమ్యాలతో కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. తక్షణం హోంశాఖ ఈ విషయంపై దృష్టిసారించాలన్నారు. నాయకులు నాగరాజ, వీరేష, లక్ష్మన, కార్యకర్తలు పాల్గొన్నారు.

సహకార రత్న అవార్డు అందుకున్న వెంకటేష్ హెగ్డే



బళ్లారి రూరల్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హోస్పేటలో జరిగిన బీడీసీసీ బ్యాంకు సహకార యూనిట్, ఇతర సంఘాల ఆధ్వర్యంలో బళ్లారి మీడియా కో ఆర్డినేటర్ వెంకటేష్ హెగ్డేకి సహకార రత్న అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు లభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డుతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.

వ్యక్తి దారుణ హత్య

బళ్లారి రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మోతి సర్కిల్ బుడా కాంప్లెక్స్ ఆవరణలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి హత్యకు గురైనట్లు మంగళ వారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఏపీఎంసీ పోలీసులతో పాటు ఎస్పీ డాక్టర్ శోభారాణి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్యకు గురైన వ్యక్తికి 35 నుంచి 38 సంవత్సరాల వయస్సు ఉండవచ్చన్నారు. సోమవారం రాత్రి మద్యంమత్తులో జరిగిన గొడవకు కారణమై ఉంటుందన్నారు. హత్యకు గురైన వ్యక్తికి ముఖం, కాళ్లు చేతులపైన గాయాలు వుండటంతో దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శోభారాణి

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

ఇందిరాగాంధీ (జయంతి)



'భారతరత్న' పురస్కార గ్రహీత ఇందిరా ప్రియదర్శిని గాంధీ 1917 నవంబరు 19న అలహాబాద్ (ప్రస్తుతం ప్రయాగ్ రాజ్)లో జన్మించారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కుమార్తెగానే కాకుండా దేశ తొలి మహిళా ప్రధానమంత్రిగా తనదైన గుర్తింపు పొందారు. తండ్రి తర్వాత సుదీర్ఘకాలం ప్రధానిగా కొనసాగారు. 1966 నుంచి 1977 వరకు, తిరిగి 1980 నుంచి 1984 వరకు ప్రధానిగా వ్యవహరించారు. బంగ్లాదేశ్ లిబరేషన్‌వార్‌పై విజయం సాధించడంతో అంతర్జాతీయంగా పేరొందారు. కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రిగా విదేశీ వ్యవహారాల విధానాన్ని సరళీకృతం చేశారు. 'గరీబీ హఠావో' నినాదంతో ప్రజలకు చేరువయ్యారు. అంతకుముందు కేంద్ర ఆర్థిక మంత్రిగాను, డిఫెన్స్ మంత్రిగాను వ్యవహరించారు. 1959లో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షురాలిగాను వ్యవహరించారు. ఫిరోజ్‌గాంధీని వివాహమాడారు. 1984 అక్టోబరు 31న కన్నుమూశారు. కాగా 1999లో బీబీసీ నిర్వహించిన సమీక్షలో 'ఉమన్ ఆఫ్ ది మిలీనియం'గా గుర్తింపు పొందారు. 2020లో టైమ్ మ్యాగజైన్‌లో 20వ శతాబ్ధపు వందమంది శక్తివంతమైన మహిళల్లో ఒకరిగా నిలిచారు.

సలీల్ చౌదరి (జయంతి)



అభిమానులచే 'సలీల్ దా'గా పిలవబడే సలీల్ చౌదరి 1922 నవంబరు 19న పశ్చిమబెంగాల్ రాష్ట్రం ఘాజీపూర్‌లో జన్మించారు. కవిగా, గేయ రచయితగానే కాక సంగీత దర్శకుడిగా రాణించారు. అత్యధికంగా హిందీ, బెంగాలీ, తెలుగు, తమిళ, కన్నడతో పాటు 13 భాషలలో 150కుపైగా సినిమాలకు సంగీతాన్ని అందించిన ఘనత ఆయనది. దేశవాళీ సంగీతానికి పాశ్చాత్య సంగీతాన్ని మేళవించడం ప్రత్యేకత. రాష్ట్రపతి అవార్డు, ఫిల్మ్‌ఫేర్, సంగీత నాటక అకాడమీ అవార్డు తదితర పురస్కారాలు పొందారు. 1995 సెప్టెంబరు 5న కన్నుమూశారు.

రోడ్డు ప్రమాదంలో అయ్యప్ప భక్తుడి మృతి

పెరంబూర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన అయ్యప్ప భక్తుడు మృతి చెందగా, మరికొందరికి గాయాలయ్యాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన అయ్యప్ప భక్తులు సోమవారం కారులో శబరిమల బయల్దేరారు. దిండుగల్ జిల్లా నీలకోట మార్గంలో వస్తున్న ఆ కారును ఎదురుగా వస్తున్న పాల వ్యాన్‌ను ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న లక్ష్మీకాంత్ (36) ఘటనా స్థలంలోనే మృతిచెందగా, ఇద్దరు చిన్నారులు సహా ఆరుగురు గాయపడ్డారు. చుట్టుపక్కల వారు క్షతగాత్రులను సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

స్కూల్ వ్యాన్‌ను ఢీకొట్టిన టాటా ఏస్ వాహనం

● 8 మంది విద్యార్థులకు గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన స్కూల్ వ్యాన్

రాయచూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ముదగల్ పట్టణ సమీపంలో కే మరియమ్మ హళ్లి నుంచి ముదగల్‌కు వెళుతున్న స్కూల్ వ్యాన్‌ను ఎదురుగా వస్తున్న మినీ గూడ్స్ టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. మంగళవారం స్కూల్ వ్యాన్ ముదగల్ పట్టణానికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకోవడంతో ఇందులో ప్రయాణిస్తున్న విద్యార్థులు గాయపడ్డారు. 8 మందికి తీవ్ర గాయాలు కాగా వారిని వెంటనే ముదగల్ సముదాయ ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం లింగసుగూరు తాలూకా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో అబ్రహం, చాంద్‌పాషా, ఇమ్రాన్, సబ, శ్రీనివాస్, రామణ్ణ ఉప్పార్ ఉన్నారు.

బంగారు గొలుసు అపహరణ

పరిగి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పైడేటి గ్రామంలో నివసిస్తున్న సుజాతమ్మ మెడలో బంగారు గొలుసును అపహరించుకెళ్లినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. భర్త రాజశేఖర్‌రావు పూలు తీసుకురావడానికి బయటకు వెళ్లగా ఇంట్లో ఎవరూలేని సమయంలో దుండగులు ఇంట్లోదూరి మహిళ మెడలో బంగారు గొలుసును లాక్కుని ద్విచక్రవాహనంలో ఉడాయించారు. ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

20 మేకలు..

సుబ్బరాయనపల్లికి చెందిన హరిజన సంజీవప్పకు చెందిన 20మేకలు సోమవారం రాత్రి చోరీకి గురయ్యాయి. ఇంటివద్ద ఉన్న రొప్పంలో మేకలను ఉంచామని మంగళవారం ఉదయం లేచిచూడగా 30మేకలలో 20మేకలు మాయమైనట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. చోరీ అయిన మేకల విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పాత్రగానిపల్లికి చెందిన రవి(18) ఈనెల 10న కడుపు నొప్పి తాళలేక విషంతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హుటాహుటిన కుటుంబీకులు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. తండ్రి మంజునాథ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ శ్రీనివాసులు తెలిపారు.

హెచ్‌ఎం బదిలీకి డిమాండ్

● విద్యార్థినుల రాస్తారోకో



పాఠశాలలో నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

చింతామణి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని దొడ్డగంజూరు ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు విద్యార్థినులపట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారంటూ విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు రాస్తారోకో చేపట్టారు. మంగళవారం ఉదయం చింతామణి- శ్రీనివాసపుర జాతీయరహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. సదరు పాఠశాలలో పదో తరగతిలో 57మంది విద్యార్థినులు ఉన్నారు. పాఠశాల ఆవరణలోని హాస్టల్‌లో సుమారు 50మంది ఉంటున్నారు. హెడ్మాస్టర్ సహా ఆరుగురు ఉపాధ్యాయులు, గెస్ట్ టీచర్లు, గుమాస్తా ఒకరు పనిచేస్తున్నారు. చింతామని పట్టణ ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో అనుచితంగా ప్రవర్తించిన తరుణంలో హెడ్మాస్టర్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. హెడ్మాస్టర్ ప్రవర్తన పట్ల పలు ఫిర్యాదులు వచ్చాయి. ఈనెల 14న శుక్రవారం పేరెంట్స్ మీటింగ్‌లో హెడ్మాస్టర్ ప్రవర్తనపై తల్లిదండ్రులు గొడవపడగా క్షమాపణ చెప్పినట్టు తెలుస్తోంది. అయినా తన తీరులో మార్పు రాలేదు. దీంతో మంగళవారం ఉదయం తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకుని ధర్నా చేశారు. వెంటనే సమాచారం అందుకున్న బీఈఓ ఉమాదేవి చేరుకున్నారు. విద్యార్థినులు పలువురు కన్నీరు పెట్టుకుని గోడు వెళ్లబోసుకున్నారు. హెడ్మాస్టర్‌ను బదిలీ చేసేంతవరకు తమ పిల్లలను పాఠశాలకు పంపేది లేదని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఇందుకు తగిన సమయం కావాలని బీఈఓ కోరగా విద్యార్థినులు రాస్తారోకో చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొనడంతో చింతామణి రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని నచ్చచెప్పారు. దీంతో విద్యార్థులు అక్కడనుంచి నిష్క్రమించారు. బీఈఓ ఉమాదేవి మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన గురించి చిక్కబళ్ళాపుర జిల్లా డీడీపీఐ దృష్టికి తెచ్చి నివేదిక పంపి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నిరసనలో విద్యార్థినుల తల్లిదండ్రులు చౌడరెడ్డి, ప్రభావతి, గంగాధరప్ప, సుజాత, కృషిక సమాజ అధ్యక్షుడు జయరామరెడ్డి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అశోకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థినులు

శుద్ధ నీటి వినియోగంలో ముందంజ

» చిన్న నీటిపారుదల శాఖ మంత్రి బోసరాజు

బాగేపల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శుద్ధీకరించిన నీటి వినియోగంలో రాష్ట్రం మొదటిస్థానంలో ఉందని చిన్ననీటి పారుదల, సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి బోసరాజు తెలిపారు. తాలూకాలోని ఆచేపల్లి గ్రామంలో చిన్ననీటి పారుదలశాఖ, తాలూకా యంత్రాంగం, తాలూకా పంచాయతీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటైన కార్యక్రమంలో బెంగళూరు హెచ్‌ఎన్‌వ్యాలి పథకం ద్వారా సంస్కరించిన వ్యర్థపు నీటిని తాలూకాలోని 24 చెరువులకు మళ్లించే పథకాన్ని ప్రారంభించి మాట్లాడారు. శుద్ధీకరించిన నీటిని అంతర్జాలల వృద్ధికి వినియోగించే పథకాన్ని దేశవ్యాప్తంగా అమలు చేసేలా కేంద్రం బడ్జెట్‌లో ప్రకటించిందన్నారు. ఇలా రీసైక్లింగ్ విధానంలో నీటి వాడకంలో రాష్ట్రం ప్రగతిదిశలో ఉందన్నారు. చెక్ డ్యాం నిర్మాణం, అటల్ భూజల యోజనె, బోరుబావులను మళ్లీ తవ్వడం, సంస్కరించిన నీటిని చెరువులకు మళ్లించడం వంటి పథకాలతో భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. ఇందులో భాగంగా బెంగళూరు నీటిని రెండుదశల్లో సంస్కరించి హెచ్‌ఎన్‌వ్యాలీ ద్వారా తాలూకాలోని చెరువులకు మళ్లించేందుకు రూ.70కోట్లతో పథకం రూపొందించినట్టు తెలిపారు. ఉన్నతవిద్య, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ మాట్లాడుతూ బయలుసీమ ప్రాంతానికి నదీ కాలువలు లేవన్నారు. ఇటువంటి తరుణంలో కోలారు, చిక్కబళ్ళాపుర చెరువులను నింపేందుకు సంస్కరించిన నీటిని ఉపయోగించేందుకు రాష్ట్రం ముందుకు వచ్చిందన్నారు. ఎమ్మెల్యే సుబ్బారెడ్డి మాట్లాడుతూ హెచ్ఎన్ వ్యాలీ నీరు తొలుత చిక్కబళ్ళాపురకు మాత్రమే పరిమితం చేశారని, బాగేపల్లి తాలూకాకు కూడా విస్తరించాలని పోరాటం చేయడంతో సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనీషా ఎన్ పత్రి, ఈఓ జీవీ రమేశ్, సీఐ ప్రశాంత్ వర్ణి తదితరులు పాల్గొన్నారు.



ఆచేపల్లి చెరువునుంచి ఇతర చెరువులకు నీరు మళ్లింపు ప్రారంభంలో మంత్రులు బోసరాజు, సుధాకర్, ఎమ్మెల్యే సుబ్బారెడ్డి

టీన్ ఇండియా ఫిలిం అవార్డ్స్ విజేతలకు హొంబాళె చేయూత



వివిధ పోటీల విజేతలతో ప్రముఖులు

బెంగళూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): టీన్ ఇండియా ఫిలిం అవార్డ్ సాధించిన 25ఏళ్లలోపు విద్యార్థులకు హొంబాళె ఫిలిమ్స్ చేయూత ఇస్తుందని ప్రకటించారు. ఆర్‌వీ యూనివర్సిటీలో నాల్గో విడత టీన్ ఇండియా ఫిలిం అవార్డ్ ఐదు రోజులకార్యక్రమం జరిగింది. సినిమా రూపకల్పనపై చర్చాగోష్టులు జరిగాయి. విద్యార్థులు కథ, దర్శకత్వం, ప్రదర్శన, మాస్టర్‌క్లాస్‌తోపాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జాతీయస్థాయిలోనే కాకుండా విదేశాల నుంచి చలనచిత్రోత్సవ ప్రముఖులు పాల్గొన్నారు. ఆర్‌వీ స్కూల్ ఆఫ్ మీడియా అండ్ క్రియేటివ్ ఆర్ట్ డీన్ పీయూష్‌రాయ్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ప్రతిభావంతులను వెలికితీసేందుకు ఓ వేదిక అయిందన్నారు. ప్రముఖ దర్శకుడు అమిత్‌బెహ్లో న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

నారాయణలో టెలి ఆర్‌ఓపీ సేవలు

బెంగళూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నారాయణ నేత్రాలయ ఆసుపత్రి రాష్ట్ర ప్రజలకే కాకుండా దేశవ్యాప్తంగా టెలి రెటినోపతి ఆఫ్ ప్రిమెచ్యూరిటీ (ఆర్‌ఓపీ) సేవలను అమలు చేస్తోంది. గర్భంలో ఉన్నప్పుడు 8నెలల వయసులో జన్మించడం లేదా 2 కేజీలలోపుగా శిశువు జన్మించినప్పుడు పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. అందులో ఆర్‌ఓపీపైనా ప్రభావం చూపనుంది. రెటీనా ఎదిగేందుకు ఉన్న రక్తనాళాలపై ప్రభావం చూపుతున్న కారణంగా తీవ్రమైన సమస్య నెలకొంటుంది. ఏటా నవంబరు 17న ప్రపంచ ఆర్‌ఓపీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్టు నారాయణ నేత్రాలయ సీఈఓ కెప్టెన్ ఎస్‌కే మిట్టల్ తెలిపారు. కర్ణాటక ఇంటర్నెట్ అసిస్టెడ్ డయగ్నసిస్ ఆఫ్ రెటినోపతి ఆఫ్ ప్రిమెచ్యూరిటీ ఇది దేశంలోనే తొలి కార్యక్రమమని, స్క్రీనింగ్ నెట్‌వర్క్‌లలో ఒకటిగా ఉందన్నారు. రాష్ట్రప్రభుత్వ సహకారంతో ప్రారంభించామని ప్రస్తుతం గుజరాత్, గోవా, మహారాష్ట్ర, హరియాణతోపాటు పలు రాష్ట్రాలకు సేవలు విస్తరించామన్నారు. 190 ప్రభుత్వ, ప్రైవేట్ ఎన్‌ఐసీయూలకు ఆర్‌ఓపీ సేవలు అందిస్తున్నామన్నారు. డైరెక్టర్ డాక్టర్ నరేన్‌శెట్టి, కేఐడీ ఆర్‌ఓపీ డాక్టర్ ఆనంద్ వినేకర్‌తోపాటు హ్యావ్ ఏ హార్ట్‌ఫౌండేషన్ ట్రస్టీ మను చట్లాని, రెమెడియో ఇన్నోవేటివ్ సొల్యూషన్స్ సీఈఓ ఆనంద్ శివరామన్‌లు మీడియాకు వివరించారు.



మీడియా సమావేశంలో కెప్టెన్ ఎస్‌కే మిట్టల్ తదితరులు

సంబరంగా కన్నడ రాజ్యోత్సవం

హెబ్బాళ్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆర్‌టీనగర్ హెచ్‌ఎంటీ మైదానంలో 70 కన్నడ రాజ్యోత్సవాన్ని మంగళవారం సంబరంగా నిర్వహించారు. నార్త్ డివిజన్‌కు చెందిన పౌరకార్మికులు, లారీ డ్రైవర్‌లు, ఆటో డ్రైవర్లు, క్లీనర్స్, మేస్త్రీలు, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు. పౌరకార్మికుల మహాసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజ్ నేతృత్వం వహించారు. ప్రతిభావంత కార్మికులను సత్కరించారు. ఇదే సందర్భంగా స్థానిక సమస్యలపై అధికారులకు వినతులు అందచేశారు.



పౌరకార్మికులకు సన్మానం

నూతన మేయర్‌కు సన్మానం



మేయర్ గాదెప్పను సన్మానిస్తున్న అధ్యక్షుడు గోపాలకృష్ణ, పదాధికారులు

బళ్లారిరూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరంలోని షిర్డీసాయి సేవా సత్సంగ్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షుడు గోపాలకృష్ణ నేతృత్వంలో మహా నగరపాలికె మేయర్ పి.గాదెప్పను ఘనంగా సన్మానించారు. సత్సంగ్ సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ బాలాజీ గోవిందరాజులు, జయంతి కిషోర్ కుమార్, రాధాకృష్ణ, విజయ్ కుమార్, సంజీవ్ ప్రసాద్, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

నిజాయతీ చాటిన హోంగార్డులు



సెల్‌ఫోన్‌ను జపాన్ మహిళకు ఇస్తున్న హోంగార్డులు

కంప్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): హంపి పుణ్యక్షేత్రంలో పలు ఆలయాల వద్ద విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు నిజాయతీని చాటుకున్నారు. మంగళవారం విరూపాక్షేశ్వర ఆలయం వద్ద జపాన్‌కు చెందిన మహిళ రూ.లక్ష విలువ చేసే సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. ఆ సెల్‌ఫోన్ హోమ్‌గార్డ్ రామానాయక్, విశ్వనాథ్‌కు దొరకింది. వెంటనే వారు హంపి పోలీస్‌స్టేషన్‌కు అందించి సెల్‌ఫోన్ పోగొట్టుకున్న జపాన్ మహిళకు అందించి తమ నిజాయితీని చాటుకున్నారు.

బ్యాటరీ బస్సుల ఏర్పాటు

కంప్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): హంపిలో రాతి రథం విజయ విఠల దేవస్థానాన్ని తిలకించేందుకు వచ్చే సందర్శకుల కోసం హంపి ప్రాధికార శాఖ ఆధ్వర్యంలో నూతనంగా బ్యాటరీ బస్సులను ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న బ్యాటరీ వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతుండటంతో సందర్శకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. హంపి ప్రాధికార శాఖ ముందుకొచ్చి పది బ్యాటరీ వాహనాలను మంజూరు చేసింది. ప్రస్తుతం నాలుగు బస్సులు పర్యాటకులను తరలించేందుకు సిద్ధంగా ఉంచారు. మరో ఆరు బస్సులు కొన్ని రోజుల్లో అందుబాటులో వుంటాయని అధికారులు తెలిపారు.



పర్యాటకులను తరలించేందుకు బ్యాటరీ బస్సులు సిద్ధం

21న అఖండ-2 ప్రి రిలీజ్ ర్యాలీ



బసవతారకం సేవా ట్రస్టు అధ్యక్షుడు వాణిగానహళ్ళి బాలకృష్ణ తదితరులు

ముళబాగిలు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ-2 ప్రి-రిలీజ్ ఈవెంట్ చింతామణిలో జరగనుందని బసవతారకం సేవా ట్రస్టు అధ్యక్షుడు వాణిగానహళ్ళి బాలకృష్ణ తెలిపారు. పట్టణంలోని శివకేశవనగర్‌లోని ఉద్భవ శివలింగేశ్వర దేవస్థానం సముదాయభవనంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తరహాలో కర్ణాటకలోని కోలారు లేదా చిక్కబళ్ళాపుర, బెంగళూరు గ్రామీణ జిల్లాకేంద్రంలో బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ఏర్పాటు చేయాల్సిందిగా కోరనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో బాలకృష్ణ అభిమానులు పెద్ద సంఖ్యలో ఉన్నారని తాలూకాలో 15వేలమందికిపైగా అభిమానులు ఉన్నారన్నారు. ఈ ప్రాంత క్యాన్సర్ రోగుల అనుకూలం కోసం క్యాన్సర్ ఆసుపత్రిని ఏర్పాటు చేయవలసినదిగా బాలకృష్ణను కోరనున్నట్టు తెలిపారు. ర్యాలీలో పాల్గొనేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. సమావేశంలో బసవతారకం సేవా ట్రస్టు గౌరవాధ్యక్షుడు చిన్నప్పయ్య, కార్యదర్శి రమణ, కోశాధికారి కేవీ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

బొమ్మనహళ్ళి: బోయపాటి శ్రీను దర్శకత్వంలో పాన్‌ఇండియాలో రిలీజ్ అవుతున్న అఖండ-2 తాండవం సినిమా ప్రి-రిలీజ్ ఈవెంట్‌ను విజయవంతం చేయాలని కర్ణాటక రాష్ట్ర ఎన్‌బీకే ఫ్యాన్స్ అసోసియేషన్ కన్వీనర్ కాంతారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈవెంట్‌కు ముఖ్యఅతిథులుగా కన్నడ హ్యాట్రిక్ హీరో డాక్టర్ శివరాజ్‌కుమార్, దునియా విజయ్ విచ్చేస్తారన్నారు.

వాలీబాల్ పోటీల్లో రాణించిన సాన్స్ బాలికలు



ట్రోఫీతో విద్యార్థినులు

బెంగళూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సాన్స్ కప్ రాష్ట్రస్థాయి అంతర్ పాఠశాల, కళాశాలల వాలీబాల్ టోర్నీలో సాన్స్ విద్యార్థులు రాణించారు. 50కుపైగా జట్లు పాల్గొనగా మూడురోజులపాటు పోటీలు జరిగాయి. మూడో స్థానంలో సాన్స్ విద్యార్థులు నిలిచారు. సాన్స్ పబ్లిక్‌స్కూల్ ఛైర్మన్ శ్రీకంఠప్ప, డైరెక్టర్ అభిషేక్‌లు బహుమతులు ప్రదానం చేశారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయండి

సీపీఎం నాయకుల డిమాండ్

పెనుకొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇల్లులేని నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు మంజూరుచేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు హరి, ప్రవీణ్, బాబావలి, గంగాధర్, వెంకటరాముడు ఆధ్వర్యంలో నిరసన సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇల్లులేని నిరుపేదలందరికీ ఇంటిపట్టాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. అధికారం చేపట్టి 20నెలలు గడుస్తున్నా హామీఇంతవరకు నెరవేర్చకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పెనుకొండ పట్టణంలో సర్వేనంబరు 668లో ఇల్లులేని పేదలు గుడిసెలు వేసుకున్నారన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులు వాటిని బలవంతంగా తొలగించారన్నారు. తాము కోర్టును ఆశ్రయిస్తే కోర్టు తమకు అనుకూలంగా తీర్పునిచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయాలని, లేనిపక్షంలో ప్రజాపోరాటాలకు సిద్ధం కావాల్సి ఉంటుందన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ప్రభావతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు తిప్పన్న, ఇళ్లస్థలాల పోరాట సభ్యులు సౌమ్య, అర్చన, అంజినప్ప, కొల్లమ్మ, నాగమణి పాల్గొన్నారు.

సెలవు రోజులు మినహాయించాలి

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి

గోరంట్ల, నవంబరు18(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో సెలవు రోజులు మినహాయించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు హరిప్రసాద్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు రామాంజనేయులు యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పలు ఉన్నతపాఠశాలను వారు సందర్శించి, సభ్యత్వ నమోదు చేపట్టారు. వందరోజుల ప్రణాళికనుంచి రెండవ శని, ఆదివారాలు, సంక్రాంతి సెలవులు తొలగించాలన్నారు. విరామం లేనిచదువుల వల్ల విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు పడతారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రవీంద్రనాథ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి గోపాల్‌నాయక్, హెచ్‌ఎం రామాంజులు, విజయ్‌కుమార్, మహేష్ పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం

పెనుకొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో మంగళవారం శ్రమదానం నిర్వహించారు. పీఓ కాంతరావు ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలోని పిచ్చిమొక్కలను తొలగించి చెట్లకు పాదులుచేసి నీళ్లు పోశారు. పీఓ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని రోగాల బారి నుంచి రక్షణ పొందాలన్నారు.